క్లుప్తంగా

ఈరన్న స్వామికి ప్రత్యేక పూజలు



ఈరన్న స్వామికి హారతినిస్తున్న పండితులు

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి వారికి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలిరావడంతో క్షేత్ర పరిసరాలు కిటకిటలాడాయి. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫల,పుష్పాలతో అలంకరించారు. మొక్కు చెల్లింపులో భాగంగా కొందరు భక్తులు క్షేత్ర ఆవరణలో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యంగా సమర్పించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

కోసిగి: మండలంలోని దుద్ది గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి కింద పడిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం మధ్యాహ్నం కౌతాళం మండలం తిప్పలదొడ్డి గ్రామానికి చెందిన రాజేష్, రంగస్వామి బైక్‌పై పని నిమిత్తం కోసిగి బయలుదేరారు. అయితే దుద్ది గ్రామం వద్ద కుక్కను తప్పించబోయి బైక్ అదుపు తప్పి కిందపడింది. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడగా తోటి ప్రయాణికులు ప్రైవేట్ వాహనంలో కోసిగి పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆదోనికి రెఫర్ చేశారు.

గంజి పడి బాలుడికి గాయాలు



గాయపడిన మల్ల

ఆదోని అర్బన్: మూడేళ్ల బాలుడిపై గంజి పడడంతో గాయాలైన ఘటన హొళగుంద మండలం గజ్జహళ్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బాలుడు మల్ల(3) ఎప్పటిలానే అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాడు. ఆడుకుంటున్న సమయంలో శరీరంపై గంజి పడింది. అంగన్‌వాడీ ఆయా లక్ష్మీ బాలుడిని ఇంటికి తీసుకెళ్లి విడిచిపెట్టింది. తల్లి ఉలిగమ్మ, అత్త లక్ష్మీ గజ్జహళ్లిలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం ఆదోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ జ్యోతి, ఆయా లక్ష్మీ బాధ్యతారాహిత్యంతోనే ఈ ఘటన చోటు చేసుకుందని బాలుడి తల్లి ఆరోపించింది. బాలుడికి గాయాలైన వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స కూడా చేయించలేదని తెలిపింది. నిర్లక్ష్యంగా తమ ఇంటికే తీసుకొచ్చి వదిలివెళ్లారన్నారు. బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

హంస వాహనంపై మాధవుని వైభవం



హంసవాహనంపై దర్శనమిస్తున్న స్వామివారు

కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్ల గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ మాధవస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. చివరి రోజు స్వామివారు హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వసంతోత్సవం, చక్రస్నానం, కంకణ విసర్జన కార్యక్రమాలు జరిగాయి. 12రోజుల పాటు స్వామివారి ఉత్సవాలను దేవదాయ శాఖాధికారులు, గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు.

బండగట్టు పైప్‌లైన్ లీకేజీ



కనకదిన్నె బ్రిడ్జి వద్ద వృథాగా పోతున్న నీరు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని కనకదిన్నె గ్రామంలోని బ్రిడ్జి సమీపంలో బండగట్టు పైప్‌లైన్‌కు సోమవారం లీకేజీ ఏర్పడింది. దీంతో పైప్ నుంచి నీరు ప్రధాన రోడ్డులో బ్రిడ్జిపైకి ఎగజిమ్ముతూనే ఉంది. అసలే మండు వేసవి. పలు గ్రామాల్లో నీటి ఎద్దడి నెలకొన్న తరుణంలో ఇలా నీరు వృథాగా పోతోంది. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఈయన పేరు చాకలి మహదేవ. కౌతాళం మండలం ఉప్పరహాల్ గ్రామవాసి. ఈయనకు ఎలాంటి ఆదెరవు లేదు. పింఛన్‌పై బతుకు వెళ్లదీస్తున్నారు. ప్రతి నెలా ఠంఛన్‌గా ఒకటో తేదీనే పింఛన్ వచ్చేది. ప్రస్తుతం సచివాలయానికి వెళ్లి పింఛన్ తీసుకోవాలని చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడు. మంచి చేసే వాళ్లను అడ్డుకోవడం తగదని హెచ్చరిస్తున్నాడు. తమ లాంటి వారికి కష్టాలు పెడితే ఏం లాభం వస్తుందని ప్రశ్నిస్తున్నాడు. – కౌతాళం



ఈ వృద్ధురాలి పేరు చిప్పగిరి శివమ్మ. పెద్దకడబూరు మండలం చిన్నతుంబళం గ్రామంలో ఉంటున్నారు. ఈమెకు భర్త లేరు. కుమారుడు ఉన్నా.. పదేళ్ల క్రితం ఎక్కడి వెళ్లాడే తెలియదు.. ఇంటి వద్ద ఒక్కతే ఉంటోంది. ఈ వృద్ధురాలికి నడుములేవు.. ఎక్కడికైనా పాక్కుంటూ వెళ్లాల్సిందే. అప్పుడప్పుడు పక్కింటి వాళ్లు సాయం చేస్తుంటారు. ఎలాంటి ఆధారమూ లేదు. పింఛన్ పైనే బతుకు వెళ్లదీస్తోంది. 'పింఛన్ ఇంటికి త్యాకుంటే మాలాంటోళ్ల ప్రాణాలు పోతాయి నాయనా.. ఆఫీసులు చుట్టూ తిరగలేం కొడుకా.. ఇంటికే పింఛన్ తెచ్చియ్యండి నాయనా' అని ఈమె వేడుకొంటోంది. – పెద్దకబూరు



ఈ ఫొటోలోని వ్యక్తి..కౌతాళంలోని ఎస్సీ కాలనీకి చెందిన మత్తయ్య. మానసిక వికలాంగుడు కాళ్లు చేతులు పని చేయవు. మాట్లాడటం కూడా రాదు. ఇతనికి తల్లి తాయమ్మనే అన్ని సేవలు చేస్తుంది. గత నెల వరకు వలంటీర్ ఇంటికొచ్చి పింఛన్ అందజేసేవాడు. ఈ నెల పింఛన్ సొమ్ము కోసం పంచాయతీ కార్యాలయానికి తీసుకెళ్లాలంటున్నారు..ఇలాంటి వాడిని ఎలా తీసుకెళ్లగలమంటూ తల్లి ఆవేదన వ్యక్తం చేస్తోంది. తమకు పథకాలు అందకూడదనే వాళ్లు ఇలాంటి వాటికి తెగబడుతున్నారంటూ మండిపడుతోంది. – కౌతాళం



నా పేరు మునిస్వామి. కోసిగిలోని నాగన్న గేరి నివాసం ఉండేవాళ్లం.బతుకు తెరువు కోసం కుటుంబ సమేతంగా రెండేళ్ల క్రితం గుంటూరుకు వెళ్లాం. అక్కడ పనులు చేస్తుండగా ఏడాదిన్నర క్రితం కిడ్నీ జబ్బు సోకింది. ఇప్పటి వరకు గుంటూరులోనే రోజు విడిచి రోజు డయాలసిస్ చేయించుకుంటున్నా. జగన్ ప్రభుత్వం డయాలసిస్ బాధితుడు కింద నెలకు రూ.10 వేలు పింఛన్ అందజేస్తుంది. వలంటీర్ అందుబాటులో ఉండి పింఛన్ అందించేవాడు. ఒక్కోసారి గుంటూరుకు వచ్చి పింఛన్ ఇచ్చేవాడు. ఇప్పుడు నేను కోసిగి వచ్చి పింఛన్ తీసుకోవాలంటే ఎంత అవస్థలు పడాలి. వలంటీర్లను దూరం సరికాదు. – కోసిగి

అవ్వా తాతలకు పింఛన్ కష్టాలు

- చంద్రబాబు నిర్వాకంపై దివ్యాంగులు, వితంతువులు, వృద్ధుల మండిపాటు
- వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని అడ్డుకోవడంపై సర్వత్రా నిరసన



మరాఠీగేరిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

ఆదోని టౌన్: సామాజిక పింఛన్‌దారులకు బాబు నిర్వాకం వల్ల కష్టాలు వచ్చి పడ్డాయి. ఎన్నికల నేపథ్యంలో పింఛన్ల పంపిణీకి వలంటీర్లు దూరంగా ఉంచాలన్న ఎలక్షన్ కమిషన్ ఆదేశాలతో పింఛన్‌దారులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రతినెలా తెల్లవారకముందే తలుపుతట్టి అవ్వ, తాత, పెద్దమ్మ, మామా అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేసేవారు. అయితే బాబు నిర్వాకం వల్ల తమకు మళ్లీ పాత కష్టాలు వచ్చిపడ్డాయని మండిపడుతున్నారు. 2019 ఆగస్టులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారు. 55 నెలలపాటు లబ్ధిదారులు ఇంటి వద్దనే పింఛన్లను అందుకున్నారు. ప్రజల కడుపులు కొట్టేందుకే చంద్రబాబు నాయుడు కుతంత్రాలకు తెరతీసి వలంటీర్లను విధుల నుంచి తప్పించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము ఇన్నాళ్లు వ్యయప్రయాసలు లేకుండా పింఛన్ పొందామని, మంచం నుంచి లేవలేని, పండుటాకులు, దివ్యాంగులు పంచాయతీ కార్యాలయాల ఎలా వెళ్లి పింఛన్ తెచ్చుకుంటారని ప్రశ్నిస్తున్నారు.

పింఛన్ల వివరాలు..

ఆదోని నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో 11,995 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వారికి రూ.3,57,96,500, ఆదోని మున్సిపాలిటీలో 17,405 మందికి గానూ రూ.5,24,70,000 మొత్తాన్ని ప్రతి నెలా అందిస్తున్నారు.

గ్రామ సచివాలయం దగ్గరకు వెళ్లలేం



వయస్సు మీద పడింది.. గ్రామ సచివాలయం దగ్గరకు వెళ్లలేని పరిస్థితి. అసలే ఎండాకాలం. పొద్దున 8 , 9 గంటలకే తలలు పగిలేలా ఎండ ఉంటుంది. సచివాలయానికి వెళ్లాలంటే చాలా ఇబ్బంది. ప్రతి నెలా ఇంటి వద్దకే వచ్చి పింఛన్ సొమ్మును ఇచ్చేవారు. ఈ పాడు రాజకీయాలు అవ్వాతాతల మీద చూపించడం దేనికీ.

– ఎం.లక్ష్మీదేవి, మండిగిరి పంచాయతీ ఏరియా

మాకు అన్యాయం చేయడం సరికాదు



జగనన్న ప్రభుత్వంలో దివ్యాంగులకు ఇంటి దగ్గరకే వచ్చి పింఛన్ ఇచ్చేవారు. చంద్రబాబు నాయుడు ఓర్వలేక మాకు ఇంటి వద్దకే పింఛన్ అందకుండా చేయాలని వలంటీర్లను విధుల నుంచి తప్పించారు. నేను దివ్యాంగురాలు కావడంతో సచివాలయం వద్దకు వెళ్లి పింఛన్ తీసుకోలేను. ప్రభుత్వం దివ్యాంగులకు ఇంటి వద్ద పింఛన్‌ను అందజేసేలా చర్యలు తీసుకోవాలి. మాకు ఇంత అన్యాయం చేయడం సరికాదు.

– తాయమ్మ, దివ్యాంగురాలు, మరాఠీగేరి, ఆదోని పట్టణం

తెల్లవారుజామునే పింఛన్ అందేది



ప్రతినెలా 1వ తేదీన తెల్లవారుజామున ఇంటి వద్దకే వచ్చి వలంటీర్ పింఛన్ ఇచ్చేవారు. ఈనెల నుంచి సచివాలయానికి వెళ్లి తీసుకోవలంటున్నారు. దివ్యాంగులం ఎలా వెళ్లాలి. వలంటీర్లను పని చేయనీయకుండా అడ్డుకోవడం దుర్మార్గం. మాకు సేవలందించే వారిపై రాజకీయం చేయడం రాక్షసత్వం. నాకు నడవడానికి కూడా రాదు. ముందుకు వెళ్లలేను. సచివాలయానికి ఎలా వెళ్లి పింఛన్ తీసుకోవాలి. మళ్లీ కార్యాలయాల ముందు వేచి ఉండాల్సిందేనా. పాత దుస్థితి మొదలవబోతుందేమోనని ఆందోళనగా ఉంది. ఎన్నికల అధికారులు మమ్మల్ని దృష్టిలో పెట్టుకొని మాకు న్యాయం చేయాలి.

– జయ, దివ్యాంగురాలు, రాజీవ్‌గాంధీనగర్, ఆదోని పట్టణం

వలంటీర్లపై ఆంక్షలు..

లబ్ధిదారులకు ఇక్కట్లు

- పింఛన్ల పంపిణీని అడ్డుకోవడంపై లబ్ధిదారుల అసంతృప్తి
- ఆపసోపాలు పడలేమంటున్న పండుటాకులు
- వలంటీర్లపై ఆంక్షలు సరికాదంటున్న అవ్వతాతలు, దివ్యాంగులు

మంత్రాలయం : ఒకటవ తారీఖు రాగానే అవ్వతాతల మోముల్లో ఎనలేని సంతోషం. ఇంటిపట్టున కూర్చున్న చోటకే పింఛన్ కానుక. ఆపసోపాలకు తావులేకుండా వేకువజామునే వలంటీర్లు తలుపుకొట్టి మరీ పింఛన్లు అందజేసే పరిస్థితి. అయితే టీడీపీ అధినేత చంద్రబాబు.. ఆది నుంచి వలంటీర్ వ్యవస్థపై అక్కసు వెళ్లగక్కుతున్నారు. తన కుట్రలో భాగంగా ఎన్నికలను సాకుగా చూపుతూ తన అనుచరుడితో పింఛన్ల పంపిణీకి మోకాలడ్డారు. మూడు నెలల పాటు పింఛన్ లబ్ధిదారుల కంట కన్నీళ్లు తెప్పించే పనికి పాల్పడ్డారు. వలంటీర్ల వ్యవస్థపై ఆంక్షలు విధించడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. నియోజకవర్గంలోని మంత్రాలయం మండలంలో 7,129 మందికి వివిధ రకాల పింఛన్లు అందజేస్తుండగా రూ.2.11 కోట్లు మంజూరు చేస్తున్నారు. కౌతాళంలో 8,815 పింఛన్లకు గానూ రూ.2.63 కోట్లు, కోసిగిలో 7,510 పింఛన్లకు రూ.2.25 కోట్లు, పెద్దకడబూరులో 6,636 పింఛన్లకు రూ.1.98 కోట్లు నెలనెలా పంపిణీ చేస్తున్నారు. వేలాది మందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా వలంటీర్లు పింఛన్ల పంపిణీ చేశారు. ఇక కరోనా, విపత్తుల సమయాల్లోనూ వలంటీర్ల సేవలను యావత్తు సమాజమే కొనియాడింది. ఎన్నికల సాకు చూపుతూ అవిటి బిడ్డలతో తాము ఎక్కడికని తిరగాలని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇలా పథకాలు అందకుండా చేసిన వారికి తమ బిడ్డల ఉసురు తగులుతుందని మండిపడుతున్నారు.

వారికి పోయే కాలం వచ్చింది



ప్రతిపక్ష పార్టీల వాళ్లకు పోయే కాలం వచ్చింది. ఒకరి సాయం లేకుండా బయటకు రాలేని నా లాంటి వారికి వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చే వాడు. ఇప్పుడు సచివాలయానికి వెళ్లి తీసుకోవలంట.. ఇదెక్కడి న్యాయం. మంచి చేసే వారిని కూడా చేయ్యనివ్వరా..

–మల్లప్ప, అంధుడు, ఉప్పరహాల్ గ్రామం

రెండు కాళ్లు లేవు.. ఎలా వెళ్లాలి?



ఇంటికొచ్చి ప్రభుత్వ పథకాలు, పింఛన్ అందజేసే వలంటీర్లపై రాజకీయాలు ఏంటి. ఇప్పటి వరకు వలంటీర్ వచ్చి పింఛన్ సొమ్ము ఇచ్చేవాడు. ఇప్పుడేమో పంచాయతీ కార్యాలయాలనికి వచ్చి తీసుకోవాలంటున్నారు. రెండు కాళ్లు లేని నేను అంత దూరం ఎలా వెళ్లాలి. వాడెవడో చెప్పాడని ఇష్టం వచ్చినట్లు చేస్తే మాలాంటి వారిపరిస్థితి ఏం కావాలి. పై చదువులు చదివినోళ్లు ఆలోచించరా. ఇలా దుర్మార్గంగా ఆలోచించే వారిని రాష్ట్రం నుంచి తరిమేయాలి. – ఈరన్న

వైఎస్సార్‌సీపీలో చేరిక



దాట్ల సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన దృశ్యం

కౌతాళం: మండల కేంద్రానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 కుటుంబాలు సోమవారం కౌతాళం విశాల సహకార సంఘం అధ్యక్షుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దాట్ల కృష్ణంరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి కృష్ణంరాజు, పార్టీ మండల యువ నాయకుడు దాట్ల సుబ్బరాజు కండువాలు కప్పి స్వాగతించారు. ఈడిగ కులస్తులు సత్యగౌడ్, రాము గౌడ్, గంగాధర్ గౌడ్, మూకయ్య గౌడ్, చంద్రగౌడ్, నవీన్‌గౌడ్‌తో పాటు మరో 40 కుటుంబాలు చేరాయి. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరామని చెప్పారు. కార్యక్రమంలో రాఘవేంద్రరెడ్డి, గణపతిరాజు, ఉలిగయ్య, ఉపేంద్ర, జంబయ్య, మోదీన్‌బాషా పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి

పెద్దకడబూరు : ఈస్టర్‌ను పురస్కరించుకొని సీఎస్‌ఐ పాస్టర్ రెవరెండ్ ముత్తు మనోహర్‌బాబు ఆధ్వర్యంలో మండలం కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎద్దుల బండలాగుడు పోటీలు సోమవారం హోరాహోరీగా సాగాయి. ముందుగా పోటీలను వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి ప్రారంభించారు. పోటీల్లో 12జతల ఎద్దుల పాల్గొనగా అనంతపురం పట్టణం ప్రియాంక నగర్‌కు చెందిన ఓబులపతి ఆచారి రైతుకు చెందిన కాడెద్దులు మొదటి స్థానంలో నిలిచాయి. ఎమ్మిగనూరు మండలం గుడికల్లు గ్రామానికి చెందిన దాసు అనే రైతు కాడెద్దులు రెండో స్థానం, డోన్ మండలం చీమగుంత గ్రామానికి చెందిన ఆళ్ల మదన్‌మోహన్‌రెడ్డి రైతు ఎద్దులు మూడో స్థానంలో నిలిచాయి. వీరికి వరుసగా రూ.30వేలు, రూ. 20వేలు, రూ.15వేలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ రామాంజనేయులు, జేఏసీ కన్వీనర్ రవిచంద్రారెడ్డి, ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ కమిటీ సభ్యుడు విజయేంద్రరెడ్డి, నాయకులు ముక్కరన్న, అర్లప్ప పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు వేయండి



ఆదోనిలో పోలీసుల కవాతు

ఆదోని అర్బన్: పట్టణంలో ఆదోని వన్ టౌన్, టూ టౌన్, త్రీటౌన్, రూరల్ సీఐలు తేజమూర్తి, గోపీ, నరసింహరాజు, నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో సోమవారం కవాతు నిర్వహించారు. శ్రీనివాసభవన్, పెద్దమసీదు, మరాఠీగేరి, బబ్బులమ్మగుడి, బోయగేరి, టీజీఎల్ కాలనీల మీదుగా సాగింది. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు వేయాలని కోరారు. పోలీసుల భద్రత నడుమ ఓటింగ్ జరుగుతుందని, ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా పోలీసుశాఖ కృషి చేస్తోందన్నారు.

ఉరేసుకుని ఆత్మహత్య



విజయ్‌కుమార్ (ఫైల్)

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని చందోలి గ్రామానికి చెందిన యువ రైతు ముత్యాల విజయ్‌కుమార్ (32) సోమవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాలు.. చందోలి గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ వారికున్న నాలుగు ఎకరాల నల్లరేగడి పొలంలో కంది, సద్ద పంటలు సాగుచేశాడు. గ్రామంలోని వ్యక్తుల నుంచి తీసుకున్న అప్పులు సుమారు రూ.6 లక్షల వరకు ఉన్నాయి. వానలు లేక సరిగా దిగుబడి రాకపోవడంతో సాగుకు, కుటుంబ ఖర్చుల కోసం తెచ్చుకున్న అప్పులు ఎలా తీర్చాలో అన్న బెంగతో మనోవేదనకు గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య సురేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సారా స్వాధీనం.. ముగ్గురి అరెస్ట్



పట్టుబడిన సారాను చూపుతున్న సెబ్ అధికారులు

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ స్టేషన్ పరిధిలోని వెల్దుర్తి మండలం బోయినపల్లి, గోవర్ధనగిరి, ఎల్‌బండ గ్రామాల్లో సెబ్ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ రామాంజినేయులు తెలిపారు. సారా విక్రయిస్తున్న సాలమ్మ, సుంకన్న, అయ్యస్వామిలపై కేసు నమోదు చేశామన్నారు. వారిని డోన్ కోర్టులో హాజరుపరచగా, జడ్జి 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐ అలీబేగ్, కానిస్టేబుళ్లు హనుమంతు, శంకర్‌నాయక్, విరుపాక్షిరెడ్డి, వెంకటేష్ నాయక్, సువర్ణమ్మ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

కోసిగి: బాలికలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్లు విజయకుమారి, కాత్యాయని తెలిపారు. సోమవారం స్థానిక కస్తూర్బా విద్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ షబానా అజ్మాన్ సమక్షంలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడంతో బాలికలు ఎదుగుదల లేక జీవితాలు నాశనమవుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా బాల్య వివాహాలు చేస్తున్నారని, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు.

చలివేంద్రం ఏర్పాటు

పెద్దకడబూరు : మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని మండల కేంద్రానికి చెందిన మిత్రులు నాగరాజు, సతీష్, రఘు బస్టాండ్ ఆవరణలో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఎండ తీవ్రతకు ప్రయాణికులు తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని చల్లని నీటిని అందించాలని ఫ్రిడ్జ్ ఏర్పాటు చేశారు.

ఆర్థిక సాయం

కౌతాళం: ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త బంటకుంట తర్నాలప్పను ఎంపీపీ అమరేష్, కోఆప్షన్ మెంబర్ మహబుబ్‌సాబ్ సోమవారం పరామర్శించి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న జెడ్పీటీసీ రాధా ప్రియదర్శిని ఆమె నివాసంలో కలిసి పరామర్శించారు. ఆమె ఆరోగ్య విషయాలని అడిగి తెలుసుకున్నారు. వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, మండల సచివాలయా కన్వీనర్ వెంకటరామిరెడ్డి, బంటకుంట సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ మూకన్న ఉన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

ఆదోని సెంట్రల్: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు ఆదోని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. సుధాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 2వ తేదీ(మంగళవారం) నుంచి పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో కోచింగ్ ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థికి ఉచితంగా మెటీరియల్ అందజేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోచింగ్ సమయం ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటలు వరకు ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 7901620203లో సంప్రదించాలని పేర్కొన్నారు.

8 నుంచి వల్లెలాంబదేవి ఉత్సవాలు



ఆహ్వాన పోస్టర్లను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కోడుమూరు రూరల్: స్థానిక హంద్రీనది ఒడ్డున వెలసిన శ్రీవల్లెలాంబదేవి ఆలయంలో ఈ నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం రథోత్సవ ఆహ్వాన కరపత్రాలను జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు క్రిష్టారెడ్డి చేతుల మీదుగా విడుదల చేశారు. ఉగాది పండుగను పురస్కరించుకుని ఈనెల 8 నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. 8న గోపూజ, గణపతి పూజ, గంగ పూజ, సాయంత్రం ప్రభోత్సవం, 9వ తేదీ ఉగాది రోజున అమ్మవారి రథోత్సవం, 10న పార్వేట, వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పూలవాసు, సాలప్ప, రమేష్‌నాయుడు, మల్లారెడ్డి, హనుమంతు, రవికుమార్ రెడ్డి, రవిబాబు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై టీడీపీ కుట్ర



మూగలదొడ్డిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కోసిగి: వలంటీర్లు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు అందించకుండా టీడీపీ కుట్రకు తెరతీసిందని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మూగలదొడ్డి, చిర్తనకల్, సాతనూరు, సాతనూరు కొట్టాల గ్రామాల్లో మండల నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. జగనన్న ప్రభుత్వంలో వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడకూడని ప్రతి నెల 1న తెల్లవారక ముందే ఇంటి వద్దకు వలంటీర్ వచ్చి పింఛన్ అందించేవారన్నారు. అది చూసి ఓర్వ లేక చంద్రబాబు నాయుడు వలంటీర్ వ్యవస్థను విధులకు దూరంగా ఉంచేలా కుట్ర పన్నారని వివరించారు. మంచి చేస్తున్న జగనన్నను మరోసారి ఆదరించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు బెట్టనగౌడ, ఎంపీపీ ఈరన్న, నాయకులు శ్రీనివాస రెడ్డి, మాంతేష్ స్వామి,బుళ్లి నరసింహులు, నాడుగేని వీరారెడ్డి, కొరివి నాగరాజు, ప్రతాప్, కామన్‌దొడ్డి నరసింహులుగౌడ, మూగలదొడ్డి సోమేష్, రమేష్ చిర్తనకల్లు సర్పంచ్ పాటిల్ ఈరన్న, విజయభాస్కర్ పాల్గొన్నారు.

బాబాయి చెంతకు బాలుడు



చిన్నాన్న వెంకటరెడ్డికి బాలుడిని అప్పగిస్తున్న పోలీసులు

ఆదోని రూరల్: మండలంలోని ఇస్వీ పోలీస్‌స్టేషన్ పరిధిలో తప్పిపోయిన బాలుడిని బాబాయికి అప్పగించారు. ఎస్‌ఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. కపటి గ్రామ శివారులోని ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద ఏవన్ రేంజర్ సైకిల్‌తో పాటు సోమవారం సాయంత్రం ఓ బాలుడు సంచరిస్తున్నాడు. స్థానికులు విచారించగా మౌనంగా ఉన్నాడు. దీంతో ఇస్వీ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. బాలుడి వయస్సు 8 నుంచి 10 ఏళ్లు ఉంటుందని.. మూగ ఉన్నట్లు తెలిసింది. అతని వివరాలు సోషల్ మీడియాలో షేర్ చేయగా అతని బాబాయి పి.వెంకటరెడ్డి మంగళవారం స్టేషన్‌కు వచ్చారు. బాలుడి పేరు శెట్టి బలిజ సురేష్(13) అని, తల్లిపేరు శెట్టి బలిజ శాంతమ్మ, తమది ఆదోని మండలం మాంత్రికి గ్రామమని తెలిపాడు. ఇస్వీ ఎస్‌ఐ శ్రీనివాసులు మరిన్ని వివరాలు తెలుసుకుని బాలుడిని పి.వెంకటరెడ్డికి అప్పగించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న ఎస్‌ఐ తిమ్మయ్య, పోలీసు సిబ్బంది

నందవరం: అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిమ్మయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ మాట్లాడుతూ.. నందవరం మండల పరిధిలోని నాగలదిన్నె పోలీస్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఎమ్మిగనూరు మండలం పార్లపల్లి గ్రామానికి చెందిన బోయ మునెప్ప కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. కర్ణాటక మద్యం 480 జాన్స్ ఒరిజినల్ చాయస్ విస్కీ 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు. తనిఖీలో ఏఎస్‌ఐ ఆనంద్, పోలీసులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండల పరిధిలోని బి.అగ్రహారంలో తలారి వెంకటేష్, బోయ బడేసాబ్ కర్ణాటక రాష్ట్రానికి చెందిన జాన్స్ ఒరిజినల్ ఛాయిస్ 90 ఎంఎల్ మద్యం టెట్రా ప్యాకెట్లను ములుగుందం రోడ్డులోని బ్రహ్మయ్య దేవాలయం సమీపంలో విక్రయిస్తుండగా సోమవారం సాయంత్రం సిబ్బందితో వెళ్లి పట్టుకున్నట్లు సీఐ రామకృష్ణయ్య తెలిపారు. వారి నుంచి 35 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.